'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

కరోనా కలవరం

మనిషితో దాగుడుమూతలు ఆడుతున్న కరోనా మరోసారి కల కలం సృష్టిస్తున్నది. రాష్ట్రంలో నిన్న ఒక్కరోజే నాలుగు కరోనా కేసులు నమోదయ్యాయి. చాలాకాలం తర్వాత మళ్లీ కరోనా బులెటిన్ విడుదల చేయడం గమనార్హం. దేశంలో ఈసరికే ఐదుగురు కరోనా సోకి మరణించినట్టు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో సహజంగానే ఇది ఆందోళన కలిగిస్తున్నది. ప్రస్తుతం జేఎన్-1 అనే కొత్తరకం కరోనా వైరస్ విజృంభిస్తున్నట్టు తెలుస్తున్నది. అమెరికా, చైనాలో దీని వల్ల కరోనా కేసులు పెరుగుతున్నాయి. ఇప్పుడు భారత్‌లో జేఎన్-1 కేసులు నమోదు కావడం కలవరపరిచే చర్యగానే భావించాలి.

డిసెంబర్ 8న ఈ వైరస్ మొదటిసారిగా కేరళలో బయటపడింది. అక్కడ ఈసరికే కేసుల సంఖ్య వేగంగా రెండు వేల వైపు పరుగులు తీస్తున్నది. ముగ్గురు లేదా నలుగురు మరణించినట్టు వార్తలు వెలువడ్డాయి. కర్ణాటకలో, యూపీలో ఒక్కొక్కరు మరణించడం రెండు విషయాలను తెలియజేస్తున్నది. ఒకటి వైరస్ వేగంగా దేశంలోని నలుమూలలకు పాకుతుండటం, రెండు వైరస్ వల్ల ప్రాణాలు పోతుండటం. శీతాకాలం కావడం వల్ల శ్వాసకోశ సంబంధ ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. కరోనాపై కఠినమైన నిఘా అమలుచేయాలని, పరీక్షలను పెంచాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. తీవ్రతను అర్థం చేసుకున్న కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. తెలంగాణ ప్రభుత్వం ఆ మేరకు స్పందించి ప్రజలకు హెచ్చరికలు జారీచేసి దవాఖానల్లో ఐసోలేషన్ బెడ్లు కూడా సిద్ధం చేయించింది. మాస్కులు ధరించడం, భౌతిక దూరం, చేతుల శుభ్రత వంటివి పాటించాలని, జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యపరీక్షలు చేయించుకోవాలని మార్గదర్శకాలు జారీచేసింది.

గతంలో దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు తమ కుటుంబ సభ్యులను, సన్నిహితులను కోల్పోయి ఉంటాయి. అయినా ఇటీవలి కాలంలో ప్రజల్లో కరోనా భయం క్రమంగా తగ్గుతూ వచ్చింది. కరోనా కల్లోలం నుంచి తేరుకొని ప్రపంచం ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నది. కరోనా అంటే ఒకరకమైన అలసత్వం, విసుగూ రెండూ వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో కొవిడ్ కొత్త అవతారాలు ఎత్తుతూ వ్యాపిస్తుండటం, స్వల్పసంఖ్యలో అయినా మరణాలకు కారణమవుతుండటం తేలికగా తీసుకునే విషయమైతే కాదని ప్రజలు గుర్తించాలి. కరోనా ముందు, కరోనా తర్వాత అనే కాల విభజనను గుర్తుంచుకోవాలని నొక్కిచెప్పాల్సిన అవసరం లేదు. సంపన్న, బీద దేశాలనే తేడా లేకుండా లక్షల సంఖ్యలో ప్రజలు మరణించడం, కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు అతలాకుతలమై కుప్పకూలిపోవడం మనం చూశాం. ఇప్పటివరకు మొత్తం మరణాల సంఖ్య 70 లక్షలకు చేరుకున్నదన్న సంగతి మరిచిపోరాదు. ముప్పు చాలావరకు తగ్గినప్పటికీ పూర్తిగా పోలేదని ప్రస్తుత పరిణామాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత కరోనా రకం మహమ్మారి స్థాయికి విస్తరించనప్పటికీ జాగ్రత్తలు తప్పనిసరి. కరోనా చికిత్స శ్రమదమాదులతో కూడుకున్నది కనుక చికిత్స కన్నా నివారణే మేలన్న సూక్తి అందరికీ శిరోధార్యం.



ఉచితాలు అన్నింటా ఉచితమేనా?

గుమ్మడిదల రంగారావు

ఎన్నికలప్పుడు నెరవేర్చనలవి కాని హామీలను రెండు కారణాలతో ఇస్తారు. ఎలాగూ గెలిచేదీ లేదు కదా ఒక మాట అంటే పోయేదేముందిలే అనేది ఒకటి, బీజేపీ గనక బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేస్తామన్నట్టు! రెండవది ఎలాగైనా గెలవాలన్న డెస్పరేషన్ ఉన్నప్పుడు కూడా పెద్ద పెద్ద హామీలు గుప్పిస్తారు. గెలిచాక ఉంటుంది ముసళ్ల పండుగ! కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని ప్రజలకు హామీ ఇచ్చిన విషయం కూడా ఇలాంటిదే! ఒక్క మహాలక్ష్మి పథకం కిందే మూడు హామీలున్నాయి. నెలనెలా రూ.2500 నగదు, రూ.500కే గ్యాస్ బండ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజునుంచే ఒక ప్రణాళిక లేకుండా ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణ సదుపాయం అమలుచేసింది. ప్రభుత్వం సహజంగానే చాలా ఆర్భాటం చేసింది ఈ సందర్భంగా. ఇది ప్రజలను ప్రత్యక్షంగా తాకే విషయం. మొదట మహిళలందరికీ అని, ఆ తర్వాత తెలంగాణలో నివాసం ఉంటున్నవారికే అని ఒక కండిషన్ పెట్టారు. ఎన్నికల ప్రచారంలో 'కండిషన్స్ అప్లై' అనలేదు. మహిళలందరికీ అని చెప్పారు!

> ఈ పథకం ప్రకారం.. అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణమైతే ఏడాదికి ఆర్టీసీ మీద పడే భారం రూ.2,200 కోట్లు. మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఏడాదికి రూ2,200 కోట్ల చొప్పున ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించాలి. అంటే ఐదేండ్లకు రూ.11,000 కోట్లు. ఇక్కడ అందరూ అర్థం చేసుకోవలసిన విషయం ఏమంటే ఒక్క ఉచిత ప్రయాణానికే రూ.11,000 కోట్ల భారం ప్రభుత్వం మీద పడితే, ఈ పథకంలోని మిగిలిన రెండు అంశాల మీద ఇంకా ఎంత భారం పడుతుందనేది.

ఇక్కడ అందరూ అడిగే ప్రశ్న ఏమంటే 'ఎవరు అడిగారు ఉచిత ప్రయాణ సౌకర్యం కావాలని?' ఆర్టీసీ బస్సులో ఎంత దూరం ప్రయాణం చేసినా పైసా ఖర్చులేకుండా అనేది ఊహకు అందని పరిస్థితి. దీన్ని ఎంతకాలం కొనసాగిస్తారు? దీని ప్రభావం ఇతర రంగాల మీద ఏ మేరకు ఉంటుంది? ఈ అంశాలను చూడాలి హామీలిచ్చేముందు. నది లేకపోయినా వంతెన కడతామన్నట్టు ఉండకూడదు కదా హామీలు!

ఏదీ ఉచితంగా రాదనేది మనిషికి తెలిసిన సత్యం. దేనికోసమైనా కష్టపడాలి. 'కష్టేఫలి' అనేది ప్రతి మనిషి నేర్చుకున్న నీతి. మరి ఎటువంటి ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం అంటే ఇది ఏ విధమైన అర్థశాస్త్రం అనేది అందరినీ వేధిస్తున్న ప్రశ్న. ఎక్కువమంది ప్రయాణం చేసేది డబ్బు సంపాయించుకునే పని మీదనే కదా! ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు గట్రా సంపాయించుకునేటప్పుడు ప్రయాణం ఖర్చు భరించలేరా? ఇలా ఎన్నాళ్లు ఉచితాలు ఇవ్వటం సాధ్యం? ఏదైనా ఉచితంగా ఇవ్వటమనేది అనుచితం కాదా? మనిషి సంపాయించేది ఖర్చుపెట్టడానికే కదా! ఖర్చుపెట్టవలసిన అవసరం లేకుండానే బతుకగలిగితే ఇహ పని చెయ్యాలనే ఉద్దేశం ఎందుకు కలుగుతుంది? ప్రభుత్వానికి సొంత డబ్బు అంటూ ఏదీ ఉండదు. ప్రభుత్వం దగ్గరుండే డబ్బు అంతా ప్రజలదే కదా? అందువల్ల ప్రభుత్వం ఏదైనా ఉచితంగా ఇస్తుందనేది ఒక భ్రమ. ఏదైనా ఒకటి ఉచితం అంటే ఆ మేరకు మరొకదానిపై పన్ను భారం పెరుగుతుంది. అంటే ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో తీసుకోవటమే కదా! ఈ విషయం ప్రజలకు తెలియదా? తెలియజేసేది ఎలా? ప్రజలకు, పాలకులకు మధ్య ఉన్న డిస్కనెక్ట్ ఓ అవరోధం. ప్రజల అవసరాలేమిటి, ఖజానా స్థితిగతులేమిటి అన్న ఆలోచన చెయ్యాలి.

ప్రపంచంలో ఏ సమాజమైనా కాలం గడిచేకొద్దీ ముందుకుపోవాలని, అభివృద్ధి సాధించాలని, ప్రగతిపథంలో పయనించాలని కోరుకుంటుంది. అంటే మనుషులు స్వతహాగా ఎదగాలి. వారి కాళ్లమీద వారు నిలబడాలి. సంపాదనాపరులవ్వాలి. ఇదే కదా ప్రతి మనిషి కోరుకునేది. 'కోటి విద్యలు కూటి కొరకే' అంటే అర్థం పొట్టనింపుకోవటానికి పనిచెయ్యాలనే కదా! అలాంటి పరిస్థితి రావటానికి ప్రభుత్వం నుంచి చేయూత కావాలని ముఖ్యంగా పేద వర్గాలు కోరుకుంటాయి. తగిన చేయూత అందితే అభివృద్ధి పథంలో నడుస్తామన్నది నమ్మకం. ఆ విధంగానే కదా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి. కానీ, మన దేశంలో కాలం గడిచేకొద్దీ అనేక కులాలు తమను వెనుకబడినవిగా గుర్తించమని, రిజర్వేషన్ సదుపాయం తమకు కలిపించమనీ కోరుతున్నాయి. ప్రభుత్వవర్గాలూ, మేధావులు ఈ ధోరణిని తప్పుపడుతున్నారు. మరోవైపు రాజకీయనేతల ధోరణితో ఎవరూ అడగకుండానే ఇది ఉచితం, అది ఉచితం అని హామీలు ఇచ్చి ప్రజలను బిచ్చగాళ్లుగా మారుస్తున్నది రాజకీయం. ఒకసారి ఉచితంగా ఇచ్చినదాన్ని తీసేస్తే ప్రజలు ఊరుకోరు. కానీ, ఏ ప్రభుత్వమూ ఉచితాలను ఎక్కువకాలం కొనసాగించలేదు. ఇదొకరి కడుపు కొట్టి మరొకరి కడుపు నింపటం లాంటి పనే కదా. ఈ ఉచితాల వల్ల అయ్యే ఖర్చును భర్తీ చేసుకోవటానికి వస్తువులు సేవల మీద పన్ను భారం పెరుగుతుంది. అది మద్యం అవ్వనివ్వండి, పెట్రోల్ అవ్వనివ్వండి, మరేదైనా అవ్వనివ్వండి. కొందరికి ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కలిగించి, మరికొందరికి పన్నులరూపంలో ప్రయాణ భారాన్ని పెంచటం ఏ విధంగా సమర్థనీయం? పెంచే పన్నుల వలన వచ్చే ఆదాయం సరిపోక మార్కెట్ నుంచి కొత్త అప్పు తీసుకురావాలి. అలా చేసిన అప్పును ఉత్పాదక అంశాల మీద ఖర్చు చేస్తే, దానివల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తద్వారా ప్రజల ఆదాయ మార్గాలు పెరుగుతాయి. కానీ, అప్పు సొమ్మును అనుత్పాదక అంశాల కోసం వినియోగిస్తే, అదే కదా అప్పుచేసి పప్పుకూడు అంటే! అప్పు సంక్షేమం కోసమా లేక సంపదను పెంచటానికా?

ప్రభుత్వం నుంచి ప్రజలు కోరుకునేది జీవన ప్రమాణాలు మెరుగుపడాలని కదా! ఇది జరగాలంటే ఏయే రంగాల్లో ప్రభుత్వ ప్రమేయం ప్రత్యక్షంగా ఉండాలనేది ఒకసారి చూద్దాం. ప్రతి మనిషీ విద్య, వైద్యం, రవాణా, విద్యుత్తు అనే అంశాల్లో ప్రభుత్వ ప్రమేయాన్ని కోరుకుంటారు. ఎందుకంటే ఈ రంగాల్లో ఉండే ప్రైవేటు సంస్థలు వారి సేవలను వ్యాపార దృక్పథంతోనే చూస్తాయి గానీ, సమాజ సేవా దృక్పథంతో చూడవు. వ్యాపారం అనేది లాభ నష్టాలు అనే ప్రాతిపదిక మీద నడుస్తుంది. అది సహజం. దాన్ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అయితే మన దేశంలో ప్రైవేటురంగం దౌర్భాగ్యం ఏమంటే కేవలం లాభార్జన కోణంలోనే సాగుతుంది వ్యాపార వ్యవహారం అంతా కూడానూ. సమాజానికి ఏ మేరకు మేలు చేస్తున్నామనేది ప్రధానం కాదు. లాభార్జన, వ్యాపార విస్తరణ, అక్కడ సంపాదించిన దానితో రాజకీయ ప్రాబల్యం సంపాదించుకోవటం మన ప్రైవేటురంగం తీరు.

> ఈ సంస్కృతి ముఖ్యంగా విద్య, వైద్యరంగాల్లో ప్రబలంగా కనిపిస్తుంది. అందుకే ప్రైవేటు స్కూళ్లు, ప్రైవేటు ఆసుపత్రుల సేవలు ఎంతో ఖరీదులో కూడుకొని ఉంటాయి. సామాన్య మనిషికి అందుబాటులో ఉండవు ప్రైవేటు రంగంలోని విద్య, వైద్య సేవలు. ఈ రంగాల్లో ప్రభుత్వ జోక్యం సామాన్య మనిషికి ఎంతో ఉపయోగపడుతుంది. అది అభివృద్ధి, సంక్షేమం అనే రెండింటికీ వర్తిస్తుంది.

ప్రభుత్వ స్కూళ్లలో, ప్రభుత్వ దవాఖానల్లో సరైన వసతులు కల్పించాలంటే భారీగా నిధులు వెచ్చించాలి. ఎప్పుడైతే మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయో, ప్రజలకు ప్రత్యక్ష మేలు జరుగుతుంది. పిల్లల చదువులు భారం కావు. మెరుగైన వైద్యం ఉచితంగా అందుబాటులో ఉంటే, దాని ఫలితం అనుభవించేది పేద ప్రజలు. తద్వారా, పేదల చేతిలో డబ్బు మిగులుతుంది. దానితో మెరుగైన ఆహారం, ఒంటి నిండా బట్ట కొనుక్కోగలుగుతారు. అన్నిటికన్నా మించి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతారు. ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదన్న నమ్మకంతో బతుకుతారు సామాన్య ప్రజలు. అదే కదా అందరూ కోరుకునేది!

ఈ రంగాల్లో ప్రభుత్వం చేసే ఖర్చు ప్రతి మనిషికీ ప్రత్యక్షంగా మేలు చెయ్యకపోవచ్చుగానీ మెరుగైన జీవన ప్రమాణాలను పెంపొందిస్తుంది. ఇక్కడ మెరుగైన సేవలు అందితే ప్రజలు దాన్ని సంక్షేమంగానే చూస్తారు. అయితే ఇది అనుకున్న వెంటనే జరిగేది కాదు. బస్సు ప్రయాణం ఉచితం అంటే అది వెంటనే అందుబాటులోకి వస్తుంది. కానీ మెరుగైన పాఠశాల, మెరుగైన వైద్యశాల అందుబాటులోకి రావటానికి సమయం పడుతుంది. ఫలాలు అందాలంటే సంయమనం కావాలి. ఇది దీర్ఘకాల ప్రయోజనం ఒనగూర్చే పని. కానీ నాయకులు త్వరితగతిన ప్రజల మెప్పు పొందాలనుకుంటారు. అందుకే డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్) అంటే ప్రత్యక్ష ప్రయోజనం పొందటం, అంటే ప్రజల చేతిలో డబ్బు పెట్టటం అనే వ్యసనానికి ప్రజలను అలవాటు చేస్తున్నారు.

> ఒక విధంగా ప్రజలను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారు ఈ తాయిలాలనే వ్యసనంతో. మన దేశంలో దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి చెందినవిగా చూస్తుంది దేశం. కానీ ఆశ్చర్యంగా ఉచితాలనే వ్యసనాన్ని దక్షిణాది రాష్ట్రాలే పెంచి పోషిస్తున్నాయి ఎక్కువగా. దీనికి కారణం సినిమా ప్రభావం రాజకీయాల మీద ఉండటమే. ముందు తమిళనాడు, తర్వాత ఆంధ్రప్రదేశ్, ఆపైన కర్ణాటక, మరి నేడు తెలంగాణ. ఇది పెద్ద పులి మీద స్వారీ లాంటిది. పెద్దపులి మీద కూర్చోవటమంటే చాలా భయం. దాని మీదినుంచి దిగితే అది తినేస్తుందని మరో భయం.

ఈ సంస్కృతికి అలవాటు పడకూడదు. అలవాటు పడితే బయట పడటం చాలాకష్టం. ఇది మత్తుకు బానిసలవ్వటం లాంటిదే. దీంతో అభివృద్ధి జరగటం లేదనే హక్కును ప్రజలు కోల్పోతారు. టికెట్ లేని డొక్కు బస్సుల్లో గతుకుల రోడ్ల మీద తిరగటానికి ప్రజలు ఇష్టపడతారా, లేక మంచి బస్సు, మంచి రోడ్డు మీద టికెట్ కొని ప్రయాణం చెయ్యటానికి ఇష్టపడతారా అనేదానికి సమాధానం ఏమిటో అందరికీ తెలుసు. డీబీటీ అనే వ్యసనంతో అభివృద్ధికి సూచికలైన రవాణా, విద్యుత్తు, మౌలిక వసతుల కల్పన అనే అంశాల మీద ఖర్చు పెట్టడానికి నిధుల కొరత ఏర్పడుతుంది. ఈ రంగాలు అభివృద్ధి చెందకపోతే పెట్టుబడులు రావు. పెట్టుబడులు రాకపోతే పరిశ్రమలు రావు, పరిశ్రమలు రాకపోతే ఉపాధి అవకాశాలు మెరుగుపడవు. ఉపాధి అవకాశాలు మెరుగైతేనే ప్రజల చేతిలోకి సంపాదన వస్తుంది. తద్వారా మెరుగైన జీవితాన్ని ఆస్వాదిస్తారు. ఒకదానికి మరొకటి ముడిపడి ఉన్న అంశాలు ఇవన్నీ కూడా. దీన్నిబట్టి రాజకీయాన్ని, అభివృద్ధిని విడదీసి చూడవలసిన పని లేదన్న విషయాన్ని ప్రజలు, పాలకులు గుర్తించాలి. రెండింటికీ దగ్గర సంబంధం ఉన్నది. అర్థశాస్త్రం రాజకీయాన్ని నడపాలి. అర్థశాస్త్రం హేతుబద్ధమైన ప్రక్రియ. అర్థం పర్థం లేని హామీలను ఇవ్వటం రాజకీయ శాస్త్రం. ఈ రాజకీయశాస్త్రాన్ని అర్థశాస్త్రం ఇముడ్చుకోలేదు. మనం రాజకీయ శాస్త్రం నుంచి రాజనీతి శాస్త్రం వైపు నడవాలి. రాబోయేతరాల భవిష్యత్తు గురించి ఆలోచించేదే రాజనీతి శాస్త్రం.

ఈ రోజు ప్రజలకు సంక్షేమ పథకాలు అవసరం లేదనేది కాదు ఇక్కడ వాదన. సమాజంలో ఎక్కువగా నిరాదరణకు గురయ్యేవారు వృద్ధులు, ఒంటరి మహిళలు, అంగవైకల్యం కలవారు, విద్యార్థులు. వీరు ఆర్థికంగా మరొకరి మీద ఆధారపడవలసిన పరిస్థితిని చూస్తుంటాం. ఈ వర్గాలకు ఆర్థిక చేయూతనివ్వటం అభిలషణీయం. వృద్ధులకు, వితంతువులకు, వైకల్యానికి గురైనవారికి పింఛన్ పెంచాలి. అలాగే విద్యార్థులకు సరైన చేయూతనివ్వాలి. మిగిలిన విషయాల్లో డీబీటీ అనే వ్యసనం పనికిరాదు. వ్యక్తుల చేతుల్లోకి పోయే ధనం అభివృద్ధికి సూచిక కాదు. మెరుగైన రోడ్లు, మెరుగైన, బస్సులు, కోతల్లేని విద్యుత్తు లాంటివి అభివృద్ధికి సూచికలు. మహిళలకు గౌరవసూచకంగా మహిళా దినోత్సవం, మదర్స్ డే, స్వతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే లాంటి సందర్భాల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించవచ్చు. అంతేకానీ, విచక్షణా రహితంగా, అడుగకపోయినా ఉచితాల సంస్కృతికి అలవాటు చెయ్యటం సమంజసం కాదు. ఉచితం అంటే వద్దు అనేవారు ఉండరు. ఒకసారి అలవాటు చేశాక, తీసెయ్యటం అసాధ్యం. కానీ, ఎవరికి ఉచితం అవసరమనేది గుర్తించాలి. బాగా పుష్టిగా ఉన్నవాడికి హార్లిక్స్ అవసరమా లేక బలహీనంగా ఉన్న వారికా? ప్రభుత్వం తొందరపడినట్టు అనిపిస్తుంది చాలామందికి. ముందు ముందు ఇంకా ఎన్ని ఉచితాలు, తాయిలాలు చూస్తామో కదా! కానీ ప్రజలు ఇది కోరుకుంటున్నారా?

ఈ విషయం సమాజం గమనించాలి. ఉచితాలు మాకు అవసరం లేదని చెప్పేస్థాయికి ఎదగాలి. మత్తు మందులు వద్దు అన్నట్టే ఉచితాలూ మాకొద్దు అనే స్థాయికి ఎదగాలి. ఆరోజు ఎప్పుడొస్తుందో ఎవరు చెప్పగలరు?

ఇరానీజీ.. ఇదేనా మీ సానుభూతి?

> రుతుక్రమం సమయంలో సెలవు మంజూరు చేయాలనే అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నది. ఈ అంశంపై ఇటీవల సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని వెల్లడించగా.. తాజాగా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ స్పందించారు. కొందరు ఆమె తీరును తప్పుబడుతుండగా.. మరికొందరు సమర్థిస్తున్నారు.

రుతుక్రమం సమయంలో సెలవులు ఇచ్చేలా చట్టాలు రూపొందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం బంతిని కేంద్ర ప్రభుత్వం కోర్టులో పడేసింది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖను సంప్రదించడం సబబుగా ఉంటుందని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

తాజాగా ఈ అంశంపై స్పందించిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయడం కుదరదని కరాఖండీగా చెప్పారు. మరో అడుగు ముందుకేసి అదేమీ వైకల్యం కాదని, మహిళల జీవితంలో సాధారణ అంశమేనని చెప్పడం గమనార్హం. రుతుక్రమం సమయంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు గానూ 'జాతీయ రుతుక్రమ పరిశుభ్రత విధానం-2023' ముసాయిదాను రూపొందించినట్టు వివరించారు. ఆ సమయంలో వచ్చే నొప్పి అందరిలో ఒకేలా ఉండదని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని తెలియజేశారు. పెయిన్ కిల్లర్‌ల సాయంతో కొంతమందిలో నొప్పి తగ్గిపోతుందని చెప్పడాన్ని చూస్తే సెలవుల మంజూరుపై బీజేపీ సర్కార్ ప్రతికూలంగా ఉన్నదని అర్థం అవుతున్నది. కాగా, కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ఎమ్మెల్సీ కవిత ఖండించారు. రుతుక్రమ సెలవును తిరస్కరించడమంటే.. అసంఖ్యాక స్త్రీలు భరించే జీవసంబంధమైన నొప్పిని విస్మరించడమేనని చెప్తూ మహిళా లోకం తరపున గళం వినిపించారు.

రుతుక్రమం.. మహిళల జీవిత క్రమంలో ఒక భాగం. సుమారు పన్నెండేండ్ల బాలికల నుంచి 50 ఏండ్ల మహిళల దాకా ప్రతి నెల వారిలో ఇది సాధారణంగా జరిగే ఓ ప్రక్రియ. సుమారు 5 రోజుల పాటు ఇబ్బందులు తప్పవు. ఆ సమయంలో మహిళలు పాటించాల్సిన శుభ్రత గురించి ప్రభుత్వాలతో పాటు ఎన్జీవోలు, సంస్థలు బాలికలకు అవగాహన కల్పిస్తూనే ఉన్నాయి. అందుకనుగుణంగా 2014 నుంచి ఏటా మే 28న అంతర్జాతీయ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. జర్మనీకి చెందిన వాష్ యునైటెడ్ సంస్థ దీన్ని మొదటిసారిగా ప్రతిపాదించింది.

స్త్రీల జీవితంలో ప్రత్యేకమైన ఈ సమయంలో వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ వినిపిస్తున్నది. ఈ అంశంపై స్పెయిన్ ఇప్పటికే చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. మూడు నుంచి ఐదు రోజుల పాటు సెలవు తీసుకునే వెసులుబాటు అక్కడి మహిళలకు ఉంది. మన దేశంలోనూ కేరళ ప్రభుత్వం విద్యార్థినులకు ఊరట కలిగించే నిర్ణయం తీసుకున్నది. ఉన్నత విద్య నభ్యసిస్తున్న విద్యార్థినులకు రుతుక్రమం సమయంలో సెలవు తీసుకునే వెసులుబాటును ఆ రాష్ట్ర సీఎం పినరాయి విజయన్ కల్పించారు.

కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సెలవు ఇవ్వడాన్ని తప్పుబట్టడం వివక్ష అవుతుందా? సెలవు ఇచ్చి మహిళలను ప్రత్యేకంగా చూడటం వారి పట్ల వివక్ష అవుతుందా? అనేది ఎవరూ తేల్చుకోలేకపోతున్నారు. రుతుక్రమం సమయంలో సెలవు మంజూరు చేయడమనేది లింగ వివక్ష కిందికి వస్తుందని పలువురు వాదిస్తున్నారు. 'సమానత్వం అనేది సారూప్యత కలిగిన వ్యక్తులను ఒకేలా ట్రీట్ చేయడం' అనే అరిస్టాటిల్ సూత్రాన్ని ఈ వర్గం వారు ఉదహరిస్తున్నారు. 'ఒకే దగ్గర పని చేయడమే' మహిళలు, పురుషుల మధ్య సారూప్యత అని ఈ వర్గం వారు అనుకుంటూ ఉండొచ్చు. కానీ, మహిళలు, పురుషులు వేర్వేరు అనే అసలు విషయాన్ని వారు మర్చిపోతున్నారని మరో వర్గం వారు చెప్తున్నారు. సమానత్వం అనేది సమాన అవకాశాలు, ప్రోత్సాహం, బహుమానాలు తదితర విషయాల్లో ఉండాలని మరో వర్గం వాదన. స్త్రీ, పురుషులు సమానమేనని అనుకుంటే.. మహిళలు మాత్రమే నొప్పిని ఎందుకు భరించాలని ప్రశ్నిస్తున్నారు.

> మహిళలు, పిల్లల విషయంలో ప్రత్యేక చట్టాలను చేసుకునే అవకాశం రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ -15 ప్రకారం.. వివక్ష నిరోధానికి సంబంధించి రాష్ట్రాలు చట్టాలను రూపొందించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న ఈ అంశంలో రాష్ట్రాలు చొరవ తీసుకొని చట్టాలు రూపొందిస్తాయా? లేదా? అన్నది తేలాల్సి ఉన్నది.

- ఎడిటోరియల్ డెస్క్

పోరాటం మనకు కొత్త కాదు!

గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

> ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం అనూహ్యం, దిగ్భ్రాంతికరం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు, సామాన్య ప్రజలు కూడా తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

బీఆర్ఎస్ పరాజయం పాలైనప్పటికీ 39 స్థానాలతో బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పరాజయం పాలు కావడమనేది జీర్ణించుకోలేని వాస్తవం. ఇప్పటికీ ప్రజలు కేసీఆర్ పట్ల అభిమానంతో ఉన్నారు. పోలింగ్‌కు ముందు ప్రముఖ జాతీయ మీడియా జరిపిన సర్వేలో కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండాలని అధిక శాతం మంది ప్రజలు కోరుకుంటున్నట్టు వెల్లడైంది. అయినా ప్రజలు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయలేదనేది చర్చనీయాంశం. దీనిపై పార్టీలో అంతర్మథనం జరుగుతున్నది. ప్రజాతీర్పును విశ్లేషించి, అర్థం చేసుకునే శక్తి సామర్థ్యాలు ఇతరుల కన్నా కేసీఆర్‌కే ఎక్కువగా ఉన్నాయనేది వాస్తవం.

కారణాలు ఏమైనప్పటికీ బీఆర్ఎస్ పరాజయం పాలైంది. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. ప్రజాస్వామ్యంలో ప్రజా తీర్పు పరమోన్నతమైనది. చరిత్రలో ఎందరో మహా మహులు ఓటమిపాలైన సందర్భాలున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాలను విజయం వైపు నడిపించి, ఫాసిస్టులను మట్టి కరిపించిన ఘనత చర్చిల్‌కు దక్కుతుంది. కానీ, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో బ్రిటన్ ప్రజలు కన్జర్వేటివ్ పార్టీని ఓడించారు. 83 శాతం ప్రజలు చర్చిల్ అంటే అపారమైన అభిమానం ఉన్నదని వెల్లడించారు. ఆయన పట్ల గౌరవం ఏ మాత్రం చెదిరిపోలేదు. కానీ, ఎన్నికల్లో మాత్రం కన్జర్వేటివ్ పార్టీని దించి లేబర్ పార్టీకి పట్టం గట్టారు. లేబర్ పార్టీకి 18 శాతం ఆధిక్యం లభించింది. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామంటూ మరికొన్ని పథకాలతో లేబర్ పార్టీ వెల్లడించిన ప్రణాళిక ప్రజలను ఆకట్టుకున్నది. అమెరికాకు చెందిన ప్రముఖ సంపాదకుడు 1940లో వెలువరించిన వార్తా కథనంలో... 'నేను ఎక్కడికి వెళ్లినా ప్రజలు చర్చిల్ శక్తిని, సాహసాన్ని ప్రశంసించారు. ఆయన లేకుండా బ్రిటన్ ఏమవుతుందో అనుకున్నారు. ఆయన పట్ల అపారమైన గౌరవం ఉంది.' అని పేర్కొన్నారు. ప్రజలు ఓటు వేయడానికి అనేక కారణాలుంటాయి. వాటిపై అధ్యయనం చేయవలసి ఉంటుంది.

1977 ఎన్నికల్లో ఇందిరాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ పరాజయ